క్లుప్తంగా

సమ్మె విరమించిన సెకండ్ ఏఎన్ఎంలు

కైలాస్‌నగర్: తమకు ఉద్యోగ భద్రతను కల్పించాలనే డిమాండ్‌తో గత 21 రోజులుగా కలెక్టరేట్ ఎదుట సెకండ్ ఏఎన్ఎంలు చేపట్టిన సమ్మెను సోమవారం విరమించారు. సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినందున తాత్కాలికంగా విరమిస్తున్నట్లు ఏఎన్ఎంల సంఘం నాయకులు పుష్ప, తులసీ ప్రకటించారు. మంగళవారం నుంచి యధావిధిగా విధుల్లో చేరుతున్నట్లుగా డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్‌కు సమ్మె శిబిరం వద్ద లేఖ అందజేశారు.

పేదలకు 'కల్యాణలక్ష్మి' వరం

జైనథ్: పేదలకు కల్యాణలక్ష్మి వరంగా మారిందని ఎంపీపీ మార్శెట్టి గోవర్దన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో 26 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుందర్, తుమ్మల వెంకటరెడ్డి, కోల భోజన్న, నోముల సంతోష్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

'కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్రం'

తాంసి: ప్రభుత్వరంగ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం కొమ్ము కాస్తుందని సీపీఎం భీంపూర్ మండల కన్వీనర్ స్వామి అన్నారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేఖ విధానాలను వ్యతిరేకిస్తూ.. సోమవారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం అందజేశారు. స్వామి మాట్లాడుతూ.. నిత్యావసర ధరలు పెంచడంతో సామాన్యులపై భారం పడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భొజ్జ ఆశన్న, శేక్ హైదర్ పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి

తాంసి: భీంపూర్ మండలంలోని శాంతినగర్, మందపల్లి గ్రామాల్లో కమ్యూనిటీ హాల్, ఇళ్ల నిర్మాణాల కోసం నిధులు కేటాయించాలని గ్రామస్తులు ఐటీడీఏ పీవోకు విన్నవించారు. సోమవారం ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయంలో పీవో చాహత్ బాజ్‌పాయిని కలిశారు. కార్యక్రమంలో టీకం దిలీప్, రాజు, నారాయణ, అంకం అశోక్, దాదారావు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఉట్నూర్‌రూరల్: అన్నభావుసాఠే ఉట్నూర్ పట్టణ కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్ రాజ్‌పంగే, ఉపాధ్యక్షుడిగా తల్వారే సంతోష్, కార్యదర్శులుగా కాంబ్లే బాబు, అరికిల్ల అశోక్, సంయుక్త కార్యదర్శులుగా అందారే బాబు, గోప్లే రంజిత్, సలహాదారులుగా గణేశ్, సురేశ్, లాజర్, కేర్బా మహరాజ్, గాదేకర్ సంజీవ్‌లను ఎన్నుకున్నారు. కొమ్ము బాపురావు, ఆయా మండలాల సభ్యులు హాజరయ్యారు.

నృత్య శిక్షకుడికి గురుయోగ్యత పురస్కారం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బాల కేంద్రం సూపరింటెండెంట్, కూచిపూడి నృత్య శిక్షకుడు మిట్టు రవి సాంస్కృతిక గురుయోగ్యత పురస్కారం అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఫిల్మ్ భవన్‌లో సోమవారం నిర్వహించిన జాతీయ గురుపూజోత్సవ కార్యక్రమంలో ఆయనను అవార్డుతో సత్కరించారు. కార్యక్రమంలో కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, కృష్ణ నందన్, అనంతరెడ్డి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఉట్నూర్‌రూరల్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఉట్నూర్ ఎంపీపీ జైవంత్‌రావు సూచించారు. సోమవారం మండలంలోని ఘన్‌పూర్, రాంనగర్, లక్సెట్టిపేట్ గ్రామాల్లో డ్వాక్రా మహిళలకు సీపీఎఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన మహిళా జీవనోపాదుల శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పంద్ర ల త, సంస్థ ఎస్‌పీవో సత్య, కోఆర్డినేటర్ మంగ, రవి, దిలీప్, నైనా, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన జిల్లా కేంద్రంలో ఉన్నతి శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తరగతి గదుల పరిశీలన

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలోని పాఠశాలలో మన ఊరు.. మనబడి కింద నిర్మించిన తరగతి గదులను స్థానిక సంస్థల జిల్లా అడిషనల్ కలెక్టర్ కుష్బూ గుప్తా సోమవారం పరిశీలించారు. కౌఠ(బి)లో పనులను నాణ్యతగా చేపట్టాలని అసిస్టెంట్ ఏఈ, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌కు సూచించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి నారాయణ, ఎంపీడీవో సునీల్ రెడ్డి, ఎంపీవో జీవన్ రెడ్డి, ఏఈ అఖిలేష్, సర్పంచ్ రాధిక, తదితరులు పాల్గొన్నారు.

గుబిడిపల్లెకు వెళ్లేదెలా?


గుంతలమయంగా గుబిడిపల్లె మట్టిరోడ్డు

- గుంతలమయంగా మట్టి రోడ్డు
- అదుపు తప్పుతున్న వాహనాలు
- బీటీరోడ్డు నిర్మించాలని కోరుతున్న గ్రామస్తులు

తాంసి: భీంపూర్ మండలంలోని గుబిడిపల్లె గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మట్టిరోడ్డుపై ప్రయాణం చేస్తూ.. నరకయాతన అనుభవిస్తున్నారు. తమ గ్రామానికి బీటీరోడ్డు వేయాలని గ్రామస్తులు వేడుకుంటున్న ఎలాంటి ఫలితం ఉండడం లేదు. కనీసం పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. ప్రస్తుతం కురుస్తున్న మట్టి పూర్తిగా గుంతలమయంగా మారింది. ఈరోడ్డుపై గ్రామస్తులు, వాహనదారులు తరుచూగా ప్రమాదాలకు గురవతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు మొత్తం చిత్తడిగా మారింది. కనీసం బైక్ కూడా వెళ్లలేని పరిస్థితి. అధికారుల అలసత్వం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో గ్రామానికి బీటీరోడ్డు మంజూరు కావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడుగడునా గుంత..

గుబడిపల్లె గ్రామానికి వెళ్లాలంటే మట్టిరోడ్డే దిక్కు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా గుంతలమయంగా మారింది. అడుగడుగునా గుంతలు ఉండడంతో వాహనాదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కంకర తేలడంతో కాలినడకన వెళ్లేవారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వరదనీరు ప్రవాహానికి కల్వర్టుల వద్ద మట్టి పూర్తిగా కొట్టుకుపోయింది. అత్యవసర సమయంలో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఉపాధ్యాయులు, గ్రామస్తులు కప్పర్ల గ్రామంలో బైక్‌లను నిలిపి నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామానికి వెంటనే బీటీ రోడ్డు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డు పూర్తిగా బురదమయం కావడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ప్రస్తుతం మట్టిరోడ్డు వర్షాలతో గుంతలమయంగా మారింది. రోడ్డుపై వాహనాలు వెళ్లడం కష్టంగా మారింది. అత్యవసరం అయితే అంబులెన్స్ వచ్చే అవకాశం లేదు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

– కోరెం దేవన్న, గుబిడిపల్లె

మరమ్మతులు చేయాలి

గుబిడిపల్లె గ్రామంలో నాలుగేళ్లుగా ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న. రోడ్డు బాగా లేక పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి వెంటనే బీటీరోడ్డు మంజూరు చేయాలి.

– ప్రభాకర్, ఉపాధ్యాయుడు, గుబిడిపల్లె

కబ్జా భూములను స్వాధీనం చేసుకుంటాం

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కంది శ్రీనివాసరెడ్డి

కై లాస్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కబ్జాకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. జైనథ్ మండలంలోని ఆకుర్ల, పట్టణంలోని పిట్టలవాడ, మహాలక్ష్మివాడ, చిలుకూరి లక్ష్మినగర్, తాటిగూడ కాలనీలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్నను ఓడించడమే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పని చేయాలన్నారు. అప్పుడే ఆదిలాబాద్ అభివృద్ధి చెందుతుందన్నారు. రేషన్‌కార్డు కూడా ఇవ్వని ఎమ్మెల్యే ప్రజలకింకా ఏం చేస్తాడని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, షకీల్, మీరాబాయి, సుజాత, రవి కిరణ్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారితో కంది శ్రీనివాస్‌రెడ్డి

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

బోథ్: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. ఈనెల 11 నుంచి సమ్మె చేస్తున్నామని అంగన్‌వాడీ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి చంద్రకళ తెలిపారు. ఈమేరకు సీడీపీవో సౌందర్యకు సమ్మె నోటీస్ అందజేశారు. అంగన్‌వాడీలకు రూ. 26 వేల వేతనం అందించాలని, పెన్షన్ సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో చారుశీల, వనిత, రాణి, సంగీత, లక్ష్మి, దుర్గ, హేమలత, రాధ, లక్ష్మి పాల్గొన్నారు.

తాంసి: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ డిమాండ్ చేశారు. సోమవారం భీంపూర్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈనెల 11న నుంచి సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు మీరాబాయి, సుజాత, సుప్రియ పాల్గొన్నారు.


బోథ్: సీడీపీవోకు నోటీస్ అందజేస్తున్న చంద్రకళ

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన

ఆదిలాబాద్‌టౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన సమయంలో నిరసన తెలిపారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించామని, ఉద్యోగులందరికీ క్యాడర్ ఫిక్స్ బేసిక్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2021 ఇచ్చిన 30 శాతం పీఆర్సీ వర్తింపజేయడంతో పాటు రెగ్యులర్ చేయాలన్నారు. ఈనెల 14 నుంచి జిల్లాలో 543 మంది ఉద్యోగులు సమ్మెబాట పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దొంతుల ప్రవీణ్ కుమార్, దత్తు, గోపాల్, ప్రియాంక, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కై లాస్‌నగర్: ఉద్యోగ భద్రతను కల్పించాలనే డిమాండ్లతో నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు సమ్మెకు దిగారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి ఇదివరకే సమ్మె నోటీసు ఇచ్చినా.. స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస రెడ్డి మద్దతు తెలిపారు.


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మాటిచ్చారు.. నిలబెట్టుకున్నారు

- మండలంగా సొనాల
- ఏర్పాటు చేస్తూ జీవో జారీ

బోథ్: ఎట్టకేలకు సొనాల మండలంగా మారింది. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం జీవో ఎంఎస్ నంబరు 134ను విడుదల చేసింది. పది రెవెన్యూ గ్రామాలతో సొనాలను మండలంగా ఏర్పాటు చేస్తున్నట్లు జీవోలో పేర్కొన్నారు. జీవో కాపీని హైదరాబాద్‌లోని సచివాలయంలో రెవెన్యూ జాయింట్ సెక్రటరీ శ్రీరామ్ సింగ్ చేతుల మీదుగా ఎంపీపీ తుల శ్రీనివాస్ అందుకున్నారు.

పది రెవెన్యూ గ్రామాలు.. 12 గ్రామ పంచాయతీలు..

బోథ్ మండలంలోని పది రెవెన్యూ గ్రామాలను కలుపుకుని సొనాల మండలంగా ఏర్పాటు చేశారు. వజ్జర్, చింతల్‌బోరి, ఘన్‌పూర్, సొనాల, కోట(కె), సాకెర, టివిటి, పార్డి(బి), పార్డి(కె), గొల్లాపూర్‌లను కలుపుకుని మండలంగా ఏర్పాటు చేశారు. వీటిలో సొనాల, గుర్రాలతండా, సాకెర, కోట(కె), గుట్టపక్కతండా, దేవుల్‌నాయక్ తండా, పార్డి(బి), పార్డి(కె), వజ్జర్, కేశవ్‌గూడ, ఘన్‌పూర్, చింతల్‌బోరి గ్రామ పంచాయతీలుగా ఉన్నాయి. మొత్తం 12 గ్రామ పంచాయతీలతో కలిపి సొనాలను మండలంగా ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో 25 గ్రామాలు ఉన్నాయి.


జీవో కాపీని అందుకుంటున్న ఎంపీపీ తుల శ్రీనివాస్

ఏళ్ల కల నెరవేరింది

సొనాలను మండలంగా చేయాలని ఎన్నో ఏళ్ల నుంచి ఇక్కడి ప్రజల ఆకాంక్ష. సొనాల వాసుల ఆకాంక్షను గుర్తించి సీఎం కేసీఆర్ గత ఎన్నికల ప్రచారంలో భాగంగా హామీ ఇచ్చారు. హామీ మేరకు సొనాలను మండలంగా ఏర్పాటు చేశారు.

– తుల శ్రీనివాస్, ఎంపీపీ, బోథ్

హెచ్‌ఎం, వార్డెన్‌లను సస్పెండ్ చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: సమయపాలన పాటించని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చించుఘాట్ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సిడాం సాయికుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

పందిర్‌లొద్దిలో ప్రత్యేక పూజలు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని పందిర్‌లొద్ది గ్రామంలో సోమవారం హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహారాష్ట్రలోని శివపూర్ గ్రామానికి చెందిన భజన మండలితో హనుమాన్ చాలీసా, ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పటేల్ ఎర్మ షేకు, దేవరి ఎర్మ రావు, పటేల్, మహాజన్, సర్పంచ్ పాల్గొన్నారు.

'రైతులను ఆదుకోవడంలో విఫలం'

ఇచ్చోడ: నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు సమావేశంలో మాట్లాడారు. భారీ వర్షాలకు 56 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు తెలిపారు. అయినా.. వ్యవసాయాధికారులు సర్వేలు చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేలు చేయకుండానే రాష్ట్ర ప్రభుత్వం నుంచి వ్యవసాయశాఖకు రూ.కోటి నష్ట పరిహారం ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆ నగదును రైతులకు ఏవిధంగా చెల్లిస్తారో అధికారులు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా అర్షద్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ అర్షద్ మండల మైనార్టీ అధ్యక్షుడిగా ఎన్నికవడంతో కాంగ్రెస్ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. తనను గుర్తించి పదవి ఇవ్వడంతో జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు కలీమొద్దిన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ కొమ్ము విజయ్, సునీల్ జాదవ్, లింగంపల్లి చంద్రయ్య, ప్రభాకర్, కలీం పాషా పాల్గొన్నారు.

బీజేపీ చేరిన బీఆర్‌ఎస్‌వీ మండల అధ్యక్షుడు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్‌వీ మండల అధ్యక్షుడు తన్నీరు సతీశ్ బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈసందర్భంగా సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు కాలేరి రవిచందర్, భుజంగ్‌రావు, తిమ్మన్న, రాములు, రెండు వందల మందికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొండేరి రమేశ్, మండల అధ్యక్షుడు కొలిపాక రాజశేఖర్, రాథోడ్ విమల, ఆడే ధనల్‌లాల్, మెస్రం భాగ్యలక్ష్మి, కొమ్ము రాంచందర్, బొడ్డు కిరణ్ పాల్గొన్నారు.

స్వర్ణకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఇంద్రవెల్లి: స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించి అన్ని విధాలుగా ఆదుకోవాలని స్వర్ణకారుల సంఘం మండల అధ్యక్షుడు కేశావ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ ప్రవీణ్‌కు వినతిపత్రం అందజేశారు. స్వర్ణకారుల వృతి చేస్తూ అకాల మరణం చెందిన కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. స్వర్ణకారుల వెల్ఫేర్ బోర్డు నియమించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు అరుణ్, సంజీవ్, సంతోష్, ఉమేష్, విజయ్, నితిన్, సంజీవ్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న స్వర్ణకారులు

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

తాంసి: బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని బోథ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని పొన్నారి, హస్నాపూర్ గ్రామాల్లో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ.. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పొన్నారి గ్రామానికి చెందిన పలువురు యువకులు బీఆర్‌ఎస్‌లో చేరగా.. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జ్యోతి నర్సింగ్, అశోక్, వైస్ ఎంపీపీ రేఖ, భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్, విలాస్ రెడ్డి, గోవర్దన్, అరుణ్ కుమార్, నాగయ్య, ధనుంజయ్, రమణ పాల్గొన్నారు.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అనిల్‌జాదవ్

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి

తలమడుగు: ఇచ్చోడలో ఈనెల 12న నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశం మాట్లాడారు. సకల జనుల సమ్మెతో, ఎంతోమంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న రాష్ట్రాన్ని దోపిడీ దారుల పాలైందని ఆరోపించారు. ధనిక రాష్ట్రం దరిద్ర రాష్ట్రంగా మారిందన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు దుర్గం రాజేశ్వర్, భారత్ వాగ్మరే, పద్మాకర్ రెడ్డి, ఆశన్న యాదవ్ పాల్గొన్నారు.

తాంసి: ఇచ్చోడలోని గంగారెడ్డి గార్డెన్‌లో నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మాజీ జిల్లా కన్వీనర్ భారత్ వాగ్మారే కోరారు. సోమవారం మండల కేంద్రంలో కరపత్రాలు ఆవిష్కరించారు.

కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా

కైలాస్‌నగర్: పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద అందించే ఆర్థిక సాయం తమకు అందడం లేదని భీంపూర్ మండలం అర్లి(టి) గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. మూడు సంవత్సరాలుగా రూ.6 వేల చొప్పున ఆర్థిక సాయం పొందామన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు తమ ఖాతాల్లో జమ కాలేదన్నారు. దీనిపై అధికారులను అడిగితే ఎలాంటి సమాధానం చెప్పడం లేదని మండిపడ్డారు. జిల్లా వ్యవసాయాధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు లస్మయ్య, స్వామి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న అర్లి(టి) గ్రామస్తులు

భగవాన్‌బాబా చూపిన బాటలో నడవాలి

ఇంద్రవెల్లి: సంత్‌శ్రీ భగవాన్‌బాబా చూపిన బాటలో ప్రతిఒక్కరూ నడవాలని పీఏసీఎస్ చైర్మన్, ఇంద్రవెల్లి పటేల్ మారుతి డోంగ్రె అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని డోంగ్రె కాంప్లెక్స్ వద్ద సంత్ భగవాన్ బాబా జయంతి నిర్వహించారు. భగవాన్ బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అందునాయక్ తండా జ్వాలముఖి ఆలయ మహరాజ్ రాంసింగ్ బాబా, ఉప సర్పంచ్ గణేష్ తహరే, కేంద్రే బాలాజీ, కోరెంగా సుంకట్‌రావ్, కనక తుకారం, తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న భక్తులు

పౌష్టికాహారం తీసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంధ్యారాణి అన్నారు. మండలంలోని ఉమ్రి గ్రామంలో యుక్త వయస్సు పిల్లలకి పోషణ మాసం సందర్భంగా పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అంగన్‌వాడీలో పెట్టే భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమాచారం

అన్నదానం

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మారుమూల గ్రామాల నుంచి ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే అర్జీదారుల ఆకలిని తీర్చేందుకు వెడ్మ బొజ్జన్న బువ్వ కార్యక్రమంలో భాగంగా సోమవారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఖయ్యుం, లాజర్, రాధబాయి, నీలబాయి, అన్నపూర్ణ, దేవానందం, జైవంత్‌రావు, ఇమ్రాన్, అహ్మద్, భీమన్న, మాజీద్ పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ పూజలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఆదిత్యనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం మున్సిపల్ చైర్మన్ ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి గతంలో ఎమ్మెల్యే జోగు రామన్న ఒక నెల వేతనాన్ని విరాళంగా అందజేశారని గుర్తు చేశారు.

రోడ్డుపై విరిగిపడిన చెట్టు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని బీర్సాయిపేట సమీపంలో ఉట్నూర్– మంచిర్యాల ప్రధాన రహదారిపై చెట్టు రోడ్డుకు అడ్డంగా విరిగిపడింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఆదివారం కురిసిన భారీ వర్షానికి విరిగిపడింది. గమనించిన చెట్టును తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

బోథ్‌లో కురిసిన వర్షం

బోథ్: మండల వ్యాప్తంగా సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో వాగులు పొంగిపొర్లాయి. నక్కలవాడు వంతెనపై నుంచి వరద ఉధృతంగా ప్రవహించింది. నక్కలవాడ, కొత్తపల్లె, లక్ష్మిపూర్, రేండ్లపల్లె గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. మర్లపెల్లిలో విద్యుత్ తీగలపై చెట్లు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

ఆర్థిక సాయం

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామానికి చెందిన రమేశ్‌యాదవ్ అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని భీంపూర్ మండల యాదవ సంఘం సభ్యులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి సంఘం తరపున రూ.5వేల నగదు ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు దేవారెడ్డి, మట్ట శ్రీనివాస్, లస్మన్న, కిష్టయ్య యాదవ్ పాల్గొన్నారు.

జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలిని కలిసిన నాయకులు

బోథ్: జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు షహజాదిని బీజేవైఎం నాయకులు ఆదిలాబాద్‌లో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సభ్యురాలిగా నియమితులైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మానాల శేఖర్, గోతి సునీల్, రంజిత్, గొర్ల కార్తీక్ పాల్గొన్నారు.

పరామర్శ

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లోకారి గ్రామానికి చెందిన గేడం రవి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఏబీసీ సభ్యురాలు గంద్రత్ సోమవారం హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను పరామర్శించారు.

టార్పాలిన్, వంటసామగ్రి అందజేత

బేల: మండలంలోని వరూర్(పి) గ్రామంలో భారీ వర్షాలకు నష్టపోయిన వారి కుటుంబాలకు సోమవారం జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తరపున టార్పాలిన్, వంట సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ సామ రూపేష్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, గావుండే ఘణేశ్యాం, మడావి చంద్రకాంత్, అఖిల్, గోడే అవినాష్, బొక్రే శంకర్, భరత్, సంతోష్ పాల్గొన్నారు.

రిమ్స్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థి

ఇచ్చోడ: మండలంలోని దేవుల్‌నాయక్ తండాకు చెందిన రాథోడ్ విజయ్ నీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో ఎంబీబీఎస్ సీటు దక్కించుకున్నాడు. వ్యవసాయ కుటుంబంలో పుట్టి ఎంబీబీఎస్ సీటు సాధించడంతో సోమవారం గ్రామస్తులు రాథోడ్ విజయ్‌ని సన్మానించారు.